ధర్మాన్ని ఆచరించిన శ్రీరాముడు ఆదర్శనీయుడు

చిక్కడపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని ఆచరించాడు కాబట్టే శ్రీరాముడు ఆదర్శవంతుడిగా యుగయుగాలుగా నిలిచి ఉంటారని సీబీఐ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో 'శ్రీరామ నీ నామం ఎంతో రుచిరా' అనే శీర్షికతో భక్తిగీతాల గానం జరిగింది. చింతలపాటి మూర్తి, లక్ష్మీరమ, రాజ్యలక్ష్మి, ఫణి, రమణి మధురమైన పాటలతో ప్రేక్షకులను పరవశులను చేశారు. కిన్నెర రఘురామ్ అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ నాగమారుతిశర్మతో పాటు గాయనీగాయకులను సత్కరించారు.



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ప్రతి ఒక్కరూ జీవన నాణ్యతను పెంచుకోవాలి

- యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా జీవన నాణ్యతను పెంచుకోవాలని బోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యూపీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యలు లేని జీవితాన్ని గడపాలని సూచించారు. అందుకు ప్రతి రోజూ వ్యాయామం, ఆరోగ్య కరమైన భోజనం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాటపై తూటా సదస్సులో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న అల్లం నారాయణ, విమలక్క, తేజావత్ బెల్లయ్యనాయక్ తదితరులు

మావోయిస్టులతో శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలి

పాటపై తూటా - ప్రశ్నించే గొంతులు - పాలకుల అణచివేత అంశంపై సదస్సులో వక్తలు

రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టులతో శాంతిచర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాటపై తూటా - ప్రశ్నించే గొంతులు - పాలకుల అణచివేత అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ట్రైకార్ సంస్థ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, అరుణోదయ సంస్థ నిర్వాహకులు విమలక్క, జనసేన అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ.సూర్యకిరణ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రముఖ రచయిత వీణాకందస్వామి హాజరై మాట్లాడారు. దోపిడీ, పీడనలు ఉన్నంతకాలం ప్రజాపోరాటాలు కొనసాగుతుంటాయని వారన్నారు. ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై జరిగిన కాల్పుల రోజును మరచిపోలేమని అన్నారు. ప్రజాసంస్కృతిని పాలకులు నిశ్శబ్దంగా మారిస్తే గద్దర్ ఆ నిశ్శబ్దాన్ని బద్దలు గొట్టారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వాతావరణాన్ని పాలకులు భగ్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలను అర్బన్ నక్సల్స్‌గా కేంద్ర ప్రభుత్వం ముద్ర వేస్తోందని విమర్శించారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 149 మంది ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్ర వేసి హత్య చేశారని ఆరోపించారు. 2026 వరకు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిజం రోజురోజుకూ పెరిగిపోతుందని ఆందోళనం వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద, కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మావోయిస్టులు ప్రకటించిన శాంతిచర్చలకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం బేషరతుగా చర్చలకు అంగీకరించాలన్నారు. గద్దర్ శాంతి యాత్ర చేశారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరిపి హింసలేని సమాజం కోసం పనిచేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సదస్సులో సీనియర్ జర్నలిస్టు ఆశ శ్రీరాములు, సాంబమూర్తి, ఆర్‌వెంకటరెడ్డి పాల్గొన్నారు. సదస్సు ప్రారంభానికి ముందు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగం పీఠికపై ప్రతిజ్ఞ చేశారు. కళాకారుల ఆట, పాటలు ఆద్యంతం ఆహూతులను ఆలోచింపచేసేలా కొనసాగాయి.

నైట్ సర్వీసులపై గ్రేటర్ ఆర్టీసీ ఫోకస్

- **సర్వీసుల సంఖ్య పెంచే దిశగా ప్రణాళికలు**



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నైట్ సర్వీసుల సంఖ్య పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ దృష్టిసారించింది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో రాత్రిపూట రద్దీకి తగినట్లు బస్సుల ట్రిప్పులు నడిపేలా 25 డిపోల వారీగా ప్రయాణికుల లెక్కలు తీస్తుంది. రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు శివారు ప్రాంతాల్లో బస్సుల ట్రిప్పుల సంఖ్య పెంచే అవకాశాలు పరిశీలిస్తునట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు, ఉప్పల్ క్రాస్‌రోడ్, పటాన్‌చెరు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉన్నాయని అయినా రద్దీకి అనుగుణంగా వీకెండ్‌లో సర్వీసుల సంఖ్య పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రి సర్వీసులపై ప్రయాణికుల నుంచి డిపోల అధికారులు అభిప్రాయాలు సేకరిస్తున్నారని చెప్పారు.

మెట్రోకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలి

డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావిద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావిద్ ఎల్అండ్‌టీ అధికారులను కోరారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బోగీలను జతచేసి రైళ్లను నడిపిస్తామని రెండేళ్లుగా చెబుతున్నా అధికారులు ఇప్పటివరకు వాటిని అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారని చెప్పారు. నగరంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో చాలామంది మెట్రోను ఆశ్రయిస్తున్నారని, కోచ్‌ల సంఖ్య పెంచితే ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఎల్అండ్‌టీ సంస్థ, ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక చొరవ చూపి ప్యాసింజర్లను ఆదుకోవాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



బాపూజీ నగర్‌లో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, వెంకటేష్



ముషీరాబాద్‌లో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శివ, ప్రభాకర్ తదితరులు



రంగానగర్‌లో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు



చిక్కడపల్లిలో శ్రీరామకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా రాములోరి కల్యాణం

- **వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ**
- **వాడవాడలా అన్నదానాలు**

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్‌బృందం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వైభవంగా జరిగింది. ముషీరాబాద్, భోలక్‌పూర్, రాంనగర్, కవాడిగూడ, గాంధీనగర్, బర్కత్‌పుర, అంబర్‌పేట, గోల్నాక, కాచిగూడ, నల్లకుంట తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు పావనివినయ్‌కుమార్, సుప్రియా నవీన్‌గౌడ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, కన్నె ఉమాదేవి, వివిధపార్టీల నాయకులు సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం సాయంత్రం శ్రీసీతారాముల శోభాయాత్రను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. చిక్కడపల్లిలలోని వేంకటేశ్వరస్వామి ఆలయ చౌరస్తా నుంచి బాగ్‌లింగంపల్లి సంజీవయ్య నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయం వరకు సీతారాముల శోభాయాత్ర జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దోమలగూడలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొని పూజలునిర్వహించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ తదితరులు



రంగానగర్ కల్యాణానికి ముస్తాబైన సీతారామచంద్రులు



క్షేత్రం కార్యాలయంలో మల్లాది శాంతమూర్తి వీణా, పోపూరి శ్రీనివాసవర్మ సంగీత కచేరీ దృశ్యం



న్యూనల్లకుంటలో కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటేష్, ఆయన సతీమణి పద్మ, కుమార్తె డాక్టర్ దీప్తి



ముషీరాబాద్‌లో జరిగిన సీతారాముల కల్యాణంలో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్



భోలక్‌పూర్‌లో పూలమాలను సమర్పిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహ తదితరులు



ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలో జరిగిన వేడుకల్లో గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



ఉవేరా హైట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులపై విచారణ చేపడుతున్నాం

●అర్హులు మీసేవలోనే దరఖాస్తు చేసుకోవాలి ● సివిల్ సప్లై సర్కిల్-6 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి దీప్తి చౌదరి

ఇంటర్వ్యూ

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను విచారణ చేస్తున్నామని సివిల్ సప్లై సర్కిల్-6 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి దీప్తిచౌదరి తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హత గల వారు మీసేవలోనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలో కొత్త రేషన్‌కార్డులు జారీలేదని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే ఆ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం రేషన్‌కార్డుదారుల సభ్యుల ఆడిషన్స్, డిలిషన్స్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల కోడ్ వల్ల సర్కిల్ పరిధిలో సన్న బియ్యం నిలిచిపోయిందని చెప్పారు. వచ్చే నెల నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు.

- రాంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి)



ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎన్ని కొత్త దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని ఎంక్వైయిరీ చేశారు?

ఏఎస్‌వో: సర్కిల్ 6 పరిధిలో కొత్త రేషన్‌కార్డుల కోసం ఇప్పటి వరకు 9,888 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 471 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. మిగతా వాటి ఎంక్వైయిరీ కొనసాగుతుంది. విచారణ కోసం వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: కొత్తగా కుటుంబ సభ్యులు చేర్చుకోవాలని ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని ఎంక్వైయిరీ చేశారు?

ఏఎస్‌వో: ప్రస్తుతం ఉన్న వారితోపాటు కొత్తగా కుటుంబ సభ్యులను కార్డులో పేర్ల నమోదు కోసం 10,192 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,750 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశాం. మిగతావి కూడా త్వరలో పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి : చనిపోయిన, పెళ్లైన వారి పేర్ల తొలగింపు ఎన్ని?

ఏఎస్‌వో: ప్రస్తుతం ఉన్న కార్డుదారుల జాబితాలో చనిపోయిన వారి, పెళ్లైన వారి పేర్ల కోసం 3,503 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2,580 దరఖాస్తుదారుల డీలిషన్ ప్రక్రియ పూర్తయ్యింది.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో ఎన్ని ఏఎఫ్ఎస్‌సీ, ఎఫ్‌హెచ్‌సీ, ఏఏపీ కార్డులు సర్కిల్ పరిధిలో ఎన్ని ఉన్నాయి?

ఏఎస్‌వో: ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ కార్డు (ఎఫ్‌హెచ్‌సీ) 56,968 కార్డులు, అంత్యోదయ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు (ఏఎఫ్‌హెచ్‌సీ) 1,780 కార్డులు, అన్నపూర్ణ కార్డులు 18 ఉన్నాయి. మొత్తంగా 58,766 కార్డులు ఉన్నాయి. వీటిలో ఏఎఫ్‌హెచ్‌సీ కార్డుదారుల కోసం 62టన్నుల 300 కిలోలు, ఎఫ్‌హెచ్‌సీ 11,47,344 కిలోలు, ఏఏసీ కార్డుల కోసం 180 కిలోల బియ్యం ప్రతి నెలా ఇవ్వడం జరుగుతుంది.



బాలల నాటక ఉత్సవంలో పాల్గొన్న అతిథులు తదితరులు

రవీంద్రభారతిలో బాలల నాటక ఉత్సవాలు

అంతర్జాతీయ బాలల నాటక ఉత్సవాలకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈనెల 7 నుంచి 9 వరకూ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో నిశుంభితా స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహిస్తోంది. దేశ విదేశాలకు చెందిన పలువురు కళాకారులు, నాటక బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు.

కౌకూర్ దర్గా దర్శనానికి వచ్చి చెరువులో గల్లంతు



కౌకూరు చెరువులో గాలిస్తున్న డీఆర్ఎఫ్ బృందం

బిట్స్‌పిలానీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కౌకూర్ దర్గాకు దర్శనానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఓ వ్యక్తి స్నానానికి చెరువులోకి దిగి లోతు తెలియక గల్లంతయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జవహర్‌నగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్‌గౌస్(35) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి కౌకూర్ దర్గా దర్శనానికి వచ్చారు. శనివారం స్నానం చేయాలని చెరువులోకి దిగి లోతు తెలియక ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు గౌస్ కోసం వెతకగా కనిపించలేదు. వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. 24 గంటలు గడుస్తున్నా మహ్మద్‌గౌస్ ఆచూకీ దొరకలేదని, గాలింపు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలి



కవాడిగూడ శివాజీ చౌక్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు



బీజేపీ నగర కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ డా.కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అశోక్‌నగర్ సర్కిల్‌లో ఆదివారం డా.లక్ష్మణ్ పార్టీ జెండాను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి ఎగురవేశారు. ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ మాట్లాడుతూ 1980లో స్థాపించిన బీజేపీ ఆశయాలు, సిద్ధాంతాలకు లోబడి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు రమేష్‌కుమార్, నవీన్‌కుమార్, సురేష్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, శివకుమార్, సత్తిరెడ్డి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

- **కవాడిగూడ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కవాడిగూడ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఎగురవేశారు.



కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం

ముషీరాబాద్: పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.విశ్వం అన్నారు. బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని శివాలయం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఆర్.విశ్వం ఆవిష్కరించారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.



ముషీరాబాద్ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించిన కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

పేద ముస్లింల సంక్షేమం కోసమే వక్ఫ్‌బోర్డు బిల్లు

రాంనగర్: పేద ముస్లింల సంక్షేమం కోసమే వక్ఫ్‌బోర్డు బిల్లును తీసుకొచ్చామని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ బిల్లును కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు ఒకటై వ్యతిరేకించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండూ చౌరస్తా వద్ద పార్టీ పతాకావిష్కరణను లక్ష్మణ్ చేశారు. అంగన్‌వాడీ విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి అధికారం

రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ పేర్కొన్నారు. రాంనగర్ డివిజన్‌లోని కృష్ణనగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, బాలయ్య, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.